కుప్పం యువత కలలు పండనున్నాయి. సీఎం చంద్రబాబు సంకల్పంతో జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఇక్కడకు తరలి వస్తున్నాయి. ఏకంగా రూ.2,203 కోట్ల పెట్టుబడితో 7 పరిశ్రమలకు ఈనెల 28వ తేదీన సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఈ పరిశ్రమలతో ఏకంగా 22వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

\- కుప్పం, ఆంధ్రజ్యోతి

ఇండస్ట్రియల్ హబ్



శాంతిపురం మండలం తమ్మిగానిపల్లె వద్ద మదర్ డెయిరీ కోసం కేటాయించిన స్థలం

రూ.2,203 కోట్ల పెట్టుబడితో 7 పరిశ్రమల స్థాపన

రేపు సీఎం చంద్రబాబు వర్చువల్ శంకుస్థాపన

22వేల మందికి ఉపాధి అవకాశం

కంపెనీ	యూనిట్	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన	
			డైరెక్ట్	ఇన్‌డైరెక్ట్
1. అలీప్ ఫ్లాటెడ్	ఫ్యాక్టరీ ఉమెన్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ పార్క్	26.7	1,000	2,500
2. మదర్ డెయిరీ	ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్	260	850	3,150
3. ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్	ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రేడియంట్స్	525	2,000	5,000
4. ఈ-రాయిస్ మోటార్స్	ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్	200	280	130
5. శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్	డెయిరీ రిలేటెడ్ ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ అండ్ అనిమిల్ ఫీడ్	233	850	3,150
6. హిండాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్	ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రక్షన్ ఫ్యాక్టరీ	586	613	307
7. ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్	దిన ఎడిబుల్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్	372.8	1,5000	1000

రేపు సీఎం వర్చువల్ శంకుస్థాపన

కుప్పం నియోజకవర్గంలో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సీఎం చంద్రబాబు మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 3 నుంచి 4.30 గంటల మధ్యలో జరుగనున్న ఈ కార్యక్రమంలో కుప్పం నుంచి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్ బాబులతోపాటు ఆయా కంపెనీల సీఈవోలు, ఇతర ముఖ్య ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికార కూటమి పార్టీలకు చెందిన నాయకులు పాల్గొననున్నారు. సాయంత్రం 4.26-4.30 గంటల మధ్యం ఏడు కంపెనీల సివిల్ నిర్మాణాలకు సీఎం అమరావతి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు.

కేరాఫ్ కుప్పం



కుప్పంలోని కడా కార్యాలయం

ఎవరు ఎన్ని చెబుతున్నా కుప్పం లో ఇప్పటివరకు ఉపాధి అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. నిరుద్యోగ యువత ఉపాధిని వెదుక్కుంటూ వలసలు వెళ్తున్నారు. ప్రధానంగా వ్యవసాయాధార జీవనం కుప్పంలో సాగుతోంది. వైసీపీ హయాంలో శీత కన్ను వేసిన హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పరుగులు పెట్టాయి. ప్రస్తుతం హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల మీదుగా కుప్పం మండలం పరమసముద్రం చెరువులో కలుస్తున్నాయి. మధ్యలో ఉన్న చెరువులన్నీ ఈ నీటితో కళకళలాడుతున్నాయి. ఇంతకాలం వర్షాధార పంటలకు మాత్రమే పరిమితమైన రైతాంగం ఇప్పుడు వరి సాగుకు మళ్లుకుంది. నియోజకవర్గంలో ఎటుచూసినా పచ్చని పంటలతో భూములు కళకళలాడుతున్నాయి. భూముల ధరలు కూడా పెరిగాయి. ఇప్పుడు ఏకంగా 7 భారీ పరిశ్రమలు వస్తుండటంతో పారిశ్రామికాభివృద్ధి శరవేగంగా జరుగనుంది.

వ్యవసాయాధారిత పరిశ్రమలే అధికం

కొత్తగా రానున్న ఏడు పరిశ్రమల్లో వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే అధికంగా ఉన్నాయి. శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో స్థాపించనున్న మదర్ డెయిరీ ఫ్రూట్ పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్, గుడుపల్లె మండలం పోగురుపల్లెలో ఏర్పాటు చేయనున్న శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఇక్కడే స్థాపించనున్న ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఎడిబుల్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంట్స్ యూనిట్లు వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే. మదర్ డెయిరీ ఫ్రూట్ పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 41.22 ఎకరాలు, శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు చెందిన డెయిరీ రిలేటెడ్ ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ అండ్ అనిమిల్ ఫీడ్ 47.49 ఎకరాలు, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్‌కు 18.68 ఎకరాలు, ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంటడ్స్‌కు 73.63 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే కుప్పం పురపాలక సంఘం పల్లారపల్లె వద్ద ఏర్పాటు కానున్న అలీప్ పరిశ్రమకు చెందిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ ఉమెన్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ పార్క్ (మహిళా శక్తి భవన్)కోసం 18.7 ఎకరాలు, రామకుప్పం మండలం విజలాపురం వద్ద ఏర్పాటు కానున్న ఈ-రాయిస్ మోటార్స్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 25 ఎకరాలు, హిండాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రక్షన్ ఫ్యాక్టరీకి 16.3 ఎకరాల కేటాయింపు జరిగింది. ఈ మొత్తం పరిశ్రమల స్థాపన వల్ల ప్రత్యక్షంగా 7,093 మందికి, పరోక్షంగా 15,237 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు

సిద్ధంగా ఉండండి



● జిల్లా యంత్రాంగానికి సీఎం ఆదేశం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. వాయుగుండం 28వ తేదీ ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా మారనుందని, ఆ సమయంలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం ఆయన టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల యంత్రాంగానికి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు జిల్లాకు ఆరెంజ్ అలెర్టు ప్రకటించిన నేపథ్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌తోపాటు జిల్లా ముఖ్య అధికారులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరాకు అంతరాయం రాకుండా చూసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు చేర్చేలా పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ వారికి ఆహారం, మౌలిక సదుపాయాలు, ప్రత్యేక వైద్య బృందాలను నియమించాలని సూచించారు. రోడ్లు, చెరువులు, కాలువల గండ్లు, కోతకు గురైన రోడ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలని, చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన పవర్ క్రేన్లు, జేసీబీలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

నేటి 'పీజీఆర్ఎస్' రద్దు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు తుఫాన్ ప్రభావం కారణంగా భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున అర్జీలు తీసుకుని ఎవరూ కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

● ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ తుషార్‌డూడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

నేడు అన్ని పాఠశాలలకు సెలవు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీవైఈవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలు తప్పనిసరిగా ఈ ఆదేశాలు పాటించాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు తెరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలమనేరులో 69 మి.మీ వర్షపాతం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా పలమనేరులో 69 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పుంగనూరులో ఒక మి.మీ నమోదైంది. ఇక పెనుమూరులో 55, పూతలపట్టు 50, సదుం 44.8, చౌడేపల్లి41.4, చిత్తూరు అర్బన్40.8, జీడీ నెల్లూరు 39.2, గంగవరం 37.6, సోమల 35.4, తవణంపల్లె 27.4, గుడిపాల 25, ఎస్ఆర్‌పురం 22.6, ఐరాల 19, యాదమరి 17, పాలసముద్రం 14.2, చిత్తూరు రూరల్ 13.4, బంగారుపాళ్యం 6, పెద్దపంజాణి 4, బైరెడ్డిపల్లె 2.6, రామకుప్పం, రొంపిచెర్ల 2.2, కార్వేటినగరం, పులిచెర్లలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

వరద సాయం మరో రూ.50 లక్షల విడుదల

చిత్తూరు సెంట్రల్,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో అత్యవసర సహాయక చర్యలకు ప్రభుత్వం రెండో విడతగా ఆదివారం 26 జిల్లాలకు రూ.19 కోట్లు నిధులు కేటాయించింది. చిత్తూరు జిల్లాకు రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులను వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పడే పరిణామాలకు అనుగుణంగా రెస్క్యూ, రిలీఫ్ ఆపరేషన్‌కు ఖర్చు చేయాల్సి ఉంది. కాగా జిల్లాకు ఇప్పటికే రూ.2 కోట్లు విడుదల చేయగా మొత్తంగా ఇప్పటివరకు రూ.2.50 కోట్లు నిధులు వచ్చాయి. కాగా ఈ నిధులు ఖర్చు చేసే అధికారం కలెక్టర్ కలిగి ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లా ప్రత్యేకాధికారిగా గిరీషా



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా జిల్లాలో సహాయక చర్యలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించేందుకు పీఎస్ గిరిషాను జిల్లా ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. తుఫాను కారణంగా చోటు చేసుకునే పరిణామాలు, జిల్లా యంత్రాంగం తీసుకునే చర్యలు, శిబిరాల ఏర్పాటు, చెరువులు, డ్యాంల వద్ద భద్రత, ప్రమాదాలు, పశు, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవడంతోపాటు ప్రత్యేక వైద్య బృందాలు, వైద్య శిబిరాలు, ఎన్‌డీఆర్ఎఫ్, రెస్క్యూ టీంలు, కోతకు గురైన రోడ్లు, వాటి మరమ్మతులు, సురక్షిత ప్రాంతాల్లో పునరావాస శిబిరాలు, ఏర్పాట్లు తదితరాలు పరిశీలించనున్నారు.

పొలాలపై గజరాజుల బీభత్సం

● సజ్జ, మొక్కజొన్న, రాగి, అనప, అలసంద పంటలు ధ్వంసం

కల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంట పొలాలపై గజ రాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. దేవళంపేట పంచాయతీలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు మామిడి, రాగి, మొక్కజొన్న, జొన్న, సజ్జ, అనప, అలసంద పంటలను ధ్వంసం చేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఆరు ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ దిగుమూర్తివారిపల్లి వద్దకు చేరుకున్నాయి. దిగుమూర్తివారిపల్లె రైతులు బాలరాజు, శంకరయ్య, వెంకట్రామయ్య, సత్యనారాయణ, రెడ్డిప్రసాద్, చిన్నబ్బ, వెంకటరమణకు చెందిన మొక్కజొన్న, రాగి, సజ్జ, జొన్న, అనప, అలసంద పంటలను ధ్వంసం చేశాయి. పశుగ్రాసం తినేసి పేడ దిబ్బలు వేసి నానా బీభత్సం చేశాయి. అనంతరం వచ్చిన మార్గంలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. మార్గంలోని మామిడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. ధ్వంసమైన పంటలను అటవీ శాఖ సిబ్బంది పరిశీలించారు. ఆదివారం పగలంతా అడవిలోని చాకలికోన, చింతలవంక వద్ద ఏనుగుల గుంపు జాడను ట్రాకర్స్ పరిశీలించారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన రాగిపంట

చిత్తూరులో 30 పోలీసు యాక్టు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మేయర్ అనురాధ దంపతుల హత్య కేసులో నేర నిరూపణ అయిన ఐదుగురికి సోమవారం శిక్ష ఖరారు చేయనున్న నేపథ్యంలో చిత్తూరులో 30 పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు. ఆ మేరకు జిల్లా కోర్టు పరిసరాల్లో సిబ్బంది, న్యాయవాదులకు తప్ప మరెవ్వరికీ అనుమతి లేదు. నగరంలో ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండకూడదు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సీకేబాబు నివాసాల వద్ద ప్రత్యేక బందోబస్తు. సోమవారం నగరంలో ర్యాలీలు, ధర్నాలు, ప్రజా కార్యక్రమాలకు అనుమతి లేదు. కోర్టు పరిసర ప్రాంతంలో ట్రాఫిక్ మళ్లింపు. కోర్టు ప్రాంగణంలో సాధారణ ప్రజలకు అనుమతి నిషేధం. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు జాతీయ అవార్డులు అందుకున్నారు. క్వామీ ఉర్దూ శిక్షక్ కరమచారి సంఘ్-ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలో ఘాలిబ్ అకాడమి నిర్వహించిన కార్యక్రమంలో బాలీవుడ్ డైరెక్టర్ నౌషాద్, ఉర్దూ సంస్థ అధ్యక్షుడు చౌదరి వసీల్ అలీ గుజర్, కార్యదర్శి వికాస్ కుమార్ రాణాల నుంచి అవార్డులు అందుకున్నారు. ఇందులో చిత్తూరు జైహింద్ ఎంపీఎల్‌సీఎస్ (ఉర్దూ) ఎస్జీటీ జి.ముక్తార్ అహ్మద్, చిత్తూరు ఎంపీపీఎస్ (ఉర్దూ) ఎస్జీటీ ఎస్.మహబూబ్ బాషా, పుంగనూరు ఇస్లాంనగర్ జెడ్పీహెచ్ఎస్ (ఉర్దూ) స్కూల్ అసిస్టెంట్ వి.రబ్బాని, పలమనేరు న్యూపేట్ జెడ్పీహెచ్ఎస్ (ఉర్దూ) ఎస్ఏ నుస్రత్ అలియా బేగమ్ ఉన్నారు. వీరిని పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు అభినందించారు.



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

◆ వస్తాడని ఎదురుచూస్తే

కన్నీళ్లే మిగిలాయ్..!

● కర్నూలు బస్సు ప్రమాద మృతుల్లో గుడుపల్లెవాసి

అమ్మా.. నేను ఊరికి బయలుదేరా.

\- కూతురికి వాట్సప్ కాల్ చేసి చెప్పాడు.

శుక్రవారం ఉదయం 7.30 గంటలకల్లా బంగారుపేట వచ్చేస్తా. కారు తీసుకొని వచ్చేయ్.

\- కుప్పంలోని ట్రావెల్స్ డ్రైవర్ నాగరాజుకు ఫోన్ చేసి చెప్పారు.



మృతుడు త్రిమూర్తి (ఫైల్ ఫొటో)

కానీ, ఆయన రాలేదు. ఎక్కడున్నాడో తెలుసుకుందామంటే ఫోను స్విచ్చాఫ్. ఒకవైపు ఏమయ్యారోనని కుటుంబీకుల్లో ఆదుర్దా. మరోవైపు.. పనుల నిమిత్తం తరచూ బయట వెళ్తుండటంతో.. వస్తారులే అనే నమ్మకం. ఇంతలో హైదరాబాదు నుంచి వస్తూ కర్నూలు వద్ద ట్రావెల్స్ బస్సు కాలిపోయిందన్న వార్తతో.. ఆ బస్సులో ఏమైనా ఎక్కారా అన్న ఆందోళన ఇంకోవైపు. వస్తారులే అంటూ శుక్ర, శనివారాల్లో ఎదురు చూసిన వారికి కన్నీళ్లే మిగిలాయి. కర్నూలు బస్సు ప్రమాదంలో 19వ మృతదేహం గుడుపల్లె మండలం యామగానిపల్లెకు చెందిన త్రిమూర్తి(58)గా ఆదివారం నిర్ధారించడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

త్రిమూర్తి క్వారీ వ్యాపారం చేస్తున్నారు. పెద్ద భార్య వసంతమ్మతో కలిసి ఉంటున్నారు. త్రిమూర్తి, వసంతమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కళ్యాణ్ భరత్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె చైతన్య పెళ్లయి చెన్నైలో నివసిస్తున్నారు. హైదరాబాదులో బంధువుల పెళ్లికని ఈనెల 22వ తేది ఉదయం కుప్పం నుంచి బెంగళూరుకు రైలులో.. అక్కడ్నుంచి ట్రావెల్స్ బస్సులో వెళ్లారు. హైదరాబాదులో 23వ తేదీ వివాహానికి హాజరయ్యారు. అదే రోజు రాత్రి ట్రావెల్స్ తిరుగు ప్రయాణమయ్యారు. తాను కుప్పం బయలుదేరుతున్నట్లు చెన్నైలోని కుమార్తె చైతన్యకు వాట్సప్ కాల్ చేసి చెప్పారు. తనకు ఎప్పుడూ కారు తీసుకువచ్చే కుప్పానికి చెందిన ట్రావెల్స్ డ్రైవర్ నాగరాజుకు ఫోన్ చేసి.. శుక్రవారం (24వ తేది) ఉదయం 7.30కంతా కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు చేరుకుంటానని చెప్పారు. ఆ సమయానికి కారు తీసుకురమ్మన్నారు. ఆ ప్రకారం బంగారుపేట వెళ్లిన నాగరాజు ఎంత సేపు వేచిఉన్నా త్రిమూర్తి రాకపోవడం.. ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఫోను చేశారు. త్రిమూర్తి వద్ద నున్న నెంబర్లకు కాల్ చేసినా స్విచ్ ఆఫ్ అనే వచ్చింది. ఆ తర్వాత ఆయన వెనక్కి వచ్చేశారు. హైదరాబాదు నుంచి బెంగళూరు బయలుదేరిన ట్రావెల్స్ బస్సు కర్నూలు ప్రమాదంలో దగ్ధమైందన్న వార్తలు మీడియాలో రావడంతో త్రిమూర్తి కుటుంబ సభ్యులు కొంత ఆందోళనకు గురయ్యారు. ఇక, 19 మంది మృతుల వివరాలు ఆరాతీసే క్రమంలో కర్నూలు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించారు. తద్వారా 19వ మృతదేహం త్రిమూర్తిది అయి ఉంటుందని ప్రాథమికంగా గుర్తించారు. డీఎన్ఏ పరీక్ష నిమిత్తం హైదరాబాదులోని అతడి కుమారుడు కళ్యాణ్ భరత్‌కు సమాచారం ఇచ్చి కర్నూలు పిలిపించారు.ఆదివారం జరిపిన డీఎన్ఏ పరీక్షల్లో చనిపోయింది త్రిమూర్తిగా నిర్ధారించినట్లు తెలిసింది. కర్నూలు నుంచి మృతదేహాన్ని సోమవారానికి యామగానిపల్లెకు తీసుకొచ్చే అవకాశం ఉందని త్రిమూర్తి కుటుంబీకులు తెలిపారు.


\- కుప్పం, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: **రూ.3.58 కోట్లు**
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: **82,010**
తలనీలాలు సమర్పించినవారు: **29,634**

రాత్రి వాన.. ఉదయం మంచు!



పలమనేరులోని జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం కమ్ముకొన్న మంచు

పలమనేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పు చూసి ప్రజలు విస్తుపోతున్నారు. శనివారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురవడంతోపాటు అర్ధరాత్రి వరకు ముసురు వర్షాలు కురిశాయి. అయితే ఆదివారం తెల్లవారుజామున మంచు కురవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా ఈ ప్రాంతంలో డిసెంబరు, జనవరి మాసాల్లో మంచు అధికంగా కురుస్తుంది. అలాంటిది రాత్రి వర్షం కురిసి తెల్లవారుజాము నుంచి ఉదయం 7 గంటల వరకు మంచు కురవడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఐఈఆర్‌టీల ధ్రువీకరణ పత్రాల పరిశీలన



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న బృందాలు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షలోని సహిత విద్యా కేంద్రాల్లో పనిచేస్తున్న ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఆదివారం చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ ఈ ప్రక్రియను చేపట్టారు. 129 మంది ఐఈఆర్‌టీల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఇందుకోసం మూడు బృందాలను ఏర్పాటు చేశారు. చిత్తూరు, పుత్తూరు, మదనపల్లె డీవైఈవోలు ఇందిర, మహేశ్వరరావు, లోకేశ్వర్‌రెడ్డి, పలువురు ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉబికిన పాతాళ గంగ



ఆవులపల్లె వద్ద ఉబికి వస్తున్న పాతాళగంగ

సోమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వెయ్యి అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు పడని ప్రాంతంలో ప్రస్తుత వర్షాలకు పాతాళగంగ ఉబికి వస్తోంది. సోమల మండలం ఆవులపల్లె, సోమల, ఇరికిపెంట పంచాయతీల్లోని పొలాల్లో బోర్ల నుంచి నీరు ఉబికి వస్తున్నాయి. విద్యుత్ కనెక్షన్ లేకుండానే పాతాళగంగ బయటకు రావడం చూసి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ





ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ అమ్మవారి దర్శనం కోసం వేచియున్న భక్తులు

చౌడేపల్లె, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. వేకువజామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వికటించిన విందు భోజనం

● **వనదుర్గాపురంలో 30 మందికి అస్వస్థత**

పాలసముద్రం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం వనదుర్గాపురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరాజు ఇంట్లో శనివారం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. వ్రతం ముగిసిన తర్వాత గ్రామస్తులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. భోజనం తిన్న వారందరికీ సాయంత్రం నుంచి వాంతులు, విరేచనాలు ప్రారంభం కావడంతో పుత్తూరు, నగరి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నారు. ఈ విషయం ఆదివారం ఉదయం వెలుగులోకి రావడంతో ఎంపీడీవో సతీష్, డాక్టర్ మోహనకృష్ణ, డాక్టర్ జయకుమార్ గ్రామానికి చేరుకుని అంగన్‌వాడీ కేంద్రం, సబ్ సెంటర్‌లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. బాధితులకు వైద్య పరీక్షలు చేసి ఎవరికీ ప్రాణాపాయం లేదని, ఫుడ్ పాయిజన్ వల్లే ఇలా జరిగిందని నిర్ధారించారు.



బాధితులను పరీక్షిస్తున్న వైద్య బృందం

నారాయణస్వామికి మళ్లీ తలనొప్పి

- కృపాలక్ష్మి నాయకత్వం వద్దంటున్న వ్యతిరేక వర్గం
- పాలసముద్రంలో అసమ్మతి నేతల సమావేశం
- జోరు పెంచిన కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ



పాలసముద్రంలో సమావేశమైన వైసీపీ అసమ్మతి నేతలు

చిత్తూరు, వెదురుకుప్పం, పాలసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి నారాయణ స్వామికి మళ్లీ తలపోటు మొదలైంది. అధికారంలో ఉన్నప్పుడు వ్యతిరేకవర్గంతో తరచూ ఇబ్బందులు ఎదుర్కొన్న ఆయనకు ప్రతిపక్షంలో అలాంటి ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నికల్లో అతికష్టమ్మీద ఆయన కుమార్తె కృపాలక్ష్మికి అధిష్ఠానం టికెట్ ఇవ్వగా, ఇప్పుడు నియోజకవర్గంలోని వైసీపీ కీలక నాయకులు ఆమె నాయకత్వం వద్దంటున్నారు. ఈ మేరకు ఆదివారం పాలసముద్రంలో అసమ్మతి వర్గీయులు పెద్దఎత్తున సమావేశం ఏర్పాటు చేశారు. వైసీపీ అధిష్ఠానానికి విధేయతగానే ఉంటూ కృపాలక్ష్మికి వ్యతిరేకంగా పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాబోవు స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటాలని నిర్ణయించుకున్నారు. పాలసముద్రం ఎంపీపీ శ్యామలశివప్రకాష్‌రాజు, కార్వేటినగరం ఎంపీపీ లతాబాలాజీ, జీడీ నెల్లూరు జడ్పీటీసీ దామోదర్, వైసీపీ నాయకులు మోహన్, డీవీ డిల్లయ్య, వేల్కూరు బాబురెడ్డి, గుణశేఖర్, నారాయణరెడ్డి, కమలాకర్‌రెడ్డి, పేట ధనంజయరెడ్డి, మునస్వామి, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు డిప్యూటీ సీఎంగా కొనసాగిన నారాయణస్వామి, నిత్యం రెడ్లను బహిరంగంగా ద్వేషించి, ఆ సామాజిక వర్గానికి దూరమయ్యారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లతో పాటు ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ5 యాజమాన్యాలను విమర్శిస్తూ, అభివృద్ధిని పట్టించుకోకుండా ఐదేళ్లు గడిపేశారు. మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి వర్గం బలంగా ఉంటూ, ఐదేళ్ల పాటు నారాయణస్వామికి పంటి కింద రాయిలా మారింది. అప్పట్లో నిత్యం ఆయనకు వ్యతిరేకంగా సమావేశాలు జరిగేవి. గడప గడపకు.. కార్యక్రమానికి వెళ్లిన నారాయణస్వామికి పలు చోట్ల చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఎన్నికల సమయంలో ఆయనకు టికెట్ ఇస్తే పనిచేయమని బహిరంగంగా ప్రకటించడంతో పాటు అధిష్ఠానానికి తెలియజేశారు. దీంతో ఆయన్ను చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా తొలుత పంపించగా, మళ్లీ నారాయణస్వామి అధిష్ఠానాన్ని వేడుకుని కూతురు కృపాలక్ష్మికి టికెట్ తెచ్చుకున్నారు. ఎన్నికల్లో ఆమె టీడీపీ అభ్యర్థి థామస్ చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఎన్నికల్లో ఓడిపోయిన కృపాలక్ష్మి కొన్నాళ్ల పాటు బయటికి రాలేదు. ఆమె పాల్గొనే కార్యక్రమాల్లో కూడా కార్యకర్తలు పెద్దగా వెంట ఉండేవారు కాదు. లిక్కర్ స్కామ్ నేపథ్యంలో నారాయణస్వామి పేరు తెరపైకి రావడం.. సిట్ అధికారులు పుత్తూరులోని ఆయన ఇంటికి వెళ్లి విచారించడం.. దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి మంట కుట్రలో తన హస్తం కూడా ఉందని ప్రతిపక్షాలు ఆరోపించడం.. అతని ముఖ్య అనుచరుడు గోవిందయ్యను పోలీసులు అరెస్టు చేయడం.. వంటి వరుస ఘటనలతో ఆయన ప్రతిష్ఠ దిగజారింది.

● నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి దివంగత కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ ఇటీవల వైసీపీ కార్యక్రమాల్లో జోరుగా పాల్గొంటున్నారు. 2019లో టీడీపీ తరఫున పోటీ చేసిన ఆయన 2024 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. వైసీపీ ఓడిపోయాక ఆయన కూడా ఎక్కడా కనిపించలేదు. ఈ మధ్య మళ్లీ ఆయన ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈయనకు పెద్దిరెడ్డి అండ ఉందని నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చర్చించుకుంటున్నారు. జీడీ నెల్లూరుకు చెందిన మరో ముఖ్య నేత ఇటీవల తన వర్గాన్ని పిలిచి హరికృష్ణ వెంట ఉండాలని సూచించినట్లు కూడా చర్చ జరుగుతోంది.

ఆక్రమణలో వంక... పొలాల్లోకి నీరు





పొలంలోకి చేరిన నీటిని చూపుతున్న రైతు ధరణి ఆచారి, పొలంలోకి చేరుతున్న వర్షపు నీరు

గుడిపాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లమడుగు గ్రామం వద్ద ఉన్న అల్లాగుంట వంక ఆక్రమణకు గురవుతోంది. దీంతో వర్షపు నీరు వంకకు చేరకుండా పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లడంతో పంటలు మునుగుతున్నాయి. గొల్లమడుగు నుంచి అల్లాగుంట, చింతగుంటూరు చెరువు మీదుగా బొమ్మసముద్రానికి వచ్చే వంకను కొందరు ఆక్రమించారు. ప్రస్తుత వర్షాలకు నీరు పొలాల్లోకి ప్రవేశించడంతో వరి, నిమ్మ, పసుపు, వంకాయ, బెండ, అలసంద పంటలు నీటి పాలయ్యాయి. సుమారు 15 ఎకరాలలో పంట నష్టం ఏర్పడింది. కోటూరు గ్రామం నుంచి గొల్లమడుగు వెళ్లే మట్టి దారిపై వర్షపు నీరు వెళుతుండటంతో ప్రజలు ప్రయాణించలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు చెంగారెడ్డి, ఉత్తర్‌రెడ్డి, ధరణి ఆచారి, పురుషోత్తం, వాసుదేవరెడ్డి కోరుతున్నారు.

పెనుమూరులో భారీ వర్షం

మొరవపారుతున్న 92 చెరువులు



మొరవపారుతున్న చింతపెంట చెరువు

పెనుమూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని 92 చెరువులు నిండి మొరవ పారుతున్నాయి. 2015 తర్వాత ఇప్పుడు చెరువులు నిండటంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పెద్దవైన చింతపెంట, పులికల్లు చెరువులు మొరవపోతున్నాయి.

పుల్లూరులో నీట మునిగిన వరి



నీట మునిగిన వరిపంట, రైతు గణేష్‌రెడ్డి

ఐరాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లూరులో వరి పంట పూర్తిగా నీట మునిగింది. రెండు మూడు రోజులుగా నీరు నిల్వ ఉండటంతో వడ్లు మొలకెత్తాయి. ఆరు ఎకరాల్లో వరి సాగు చేశానని, కోత కోసే సమయంలో వర్షార్పణమైందని రైతు గణేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.





గంగాధరనెల్లూరు మండలంలో ఆత్మకూరు-నరసింగరాయనిపేట మధ్య ఆదివారం ఉధృతంగా ప్రవహిస్తున్న నీవానది - ఎల్లాపల్లెవంక వద్ద రోడ్డుపై పారుతున్న చెరువు మొరవనీరు

పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించడానికే ఆయుధ ప్రదర్శన

● **ఎస్పీ తుషార్ డూడీ**





విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న ఏఆర్ సిబ్బంది, తుపాకుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ఆయుధాల ప్రదర్శన ఏర్పాటు చేశామని ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. పోలీసు సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా ఏఆర్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఆయుధాల ప్రదర్శన కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు నిత్య జీవితంలో ఎదుర్కొనే సవాళ్లను, వారు ఉపయోగించే ఆయుధాలను నేరుగా చూసే అవకాశం ఉందన్నారు. పోలీసుల పనితీరుపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల్లో సమాజసేవ పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఎస్పీతోపాటు ఏఆర్ విభాగం సిబ్బంది విద్యార్థులకు ఆయుధాల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బంగారుపాళ్యం, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. సుమారు 50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అరగొండ ఫ్లైఓవర్‌పై రోడ్డు పక్కన పడి ఉండడాన్ని గమనించిన బంగారుపాళ్యం పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం శనివారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆయన మృతిచెందాడని సీఐ తెలిపారు. మృతదేహాన్ని బంగారుపాళ్యం మార్చురీలో భద్రపరిచామని, ఎవరైనా గుర్తించి 9440796736కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

టీడీపీ చిత్తూరు పార్లమెంటు.. అధ్యక్ష పదవిపై ఉత్కంఠ

● **ఐవీఆర్‌ఎస్‌లో ఇద్దరు నేతలపై అభిప్రాయ సేకరణ**





సీఆర్ రాజన్, షణ్ముగం రెడ్డి

చిత్తూరు సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్ష పదవిపై ఆ పార్టీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఇటీవల ఈ పదవికి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 17 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలకు ఐవీఆర్‌ఎస్ (ప్రజాభిప్రాయ సేకరణ) కోరుతూ ఫోన్‌కాల్స్ వచ్చాయి. అందులో ఒకే సామాజిక వర్గానికి (వన్నియకుల క్షత్రియ, బీసీ) చెందిన ఇద్దరు నేతలు ఉన్నారు. వారిలో ప్రస్తుత అధ్యక్షుడు, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సి.ఆర్.రాజన్ ఒకరు కాగా నగరికి చెందిన షణ్ముగం రెడ్డి మరొకరు. షణ్ముగం రెడ్డి ప్రస్తుతం టీడీపీ చిత్తూరు పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడిగా, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, నగరి నియోజకవర్గం క్లస్టర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఐవీఆర్‌ఎస్ ఫోన్‌కాల్‌తో టీడీపీ వర్గాల్లో అధ్యక్షుడు ఎవరనే ఉత్కంఠ నెలకొంది. సోమవారం నుంచి మరికొన్ని పేర్లు ప్రస్తావనకు రావచ్చునని సీనియర్ నేతలు చెబుతున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి



కుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ (45) మృతి చెందింది. కుప్పం పట్టణంలోని కొత్తపేటలో వెలసిన పెద్దపల్లి గంగమాంబ ఆలయ సమీపంలో రైలు పట్టాలపై ఆదివారం ఉదయం ఈ మహిళ మృత దేహాన్ని గుర్తించారు. రైలు ఢీకొనడంతో నుదిటిపై తీవ్రగాయమై మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గుర్తు పట్టినవారు రైల్వే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

చావుకు వెళ్లి వస్తూ మృత్యు ఒడిలోకి



మృతుడు పి.నాగరాజు (ఫైల్ ఫొటో)

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సమీప బంధువుల చావుకు వెళ్లి వస్తూ ఓ వ్యక్తి మృత్యు ఒడిలోకి చేరిన సంఘటన ఆదివారం సాయంత్రం కాణిపాకం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కాణిపాకం ఎస్‌ఐ నరసింహులు కథనం మేరకు... తవణంపల్లె మండలం ఎగువ తవణంపల్లెకు చెందిన పి.నాగరాజు(45) పూతలపట్టు మండలంలోని బూసిపల్లెలో తన సమీప బంధువు చావుకు వెళ్లి వచ్చే క్రమంలో చిగరపల్లె హైవే వద్ద డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. నాగరాజుకు భార్య విజయనిర్మల, కుమారుడు సంతోష్ ఉన్నారు. కుమారుడు బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని పంచనామా కోసం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు విస్తరణకు కలెక్టర్ బంగ్లా స్థలం కేటాయింపు



కలెక్టర్ బంగ్లా ప్రహరీని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరాభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం రోడ్లు విస్తరిస్తున్నారు. ఇందుకోసం తన బంగ్లా ప్రాంగణంలో 700 అడుగుల స్థలాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ అప్పగించారు. ఆ స్థలంలో ప్రస్తుతమున్న ప్రహరీని ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో తొలగించారు. కలెక్టర్ నిర్ణయంతో ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు కనెక్టివిటీ మరింత సులువుకానుంది.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.1.11 లక్షల విరాళం



చెక్కును విరాళంగా అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు తిరుపతికి చెందిన తరుణ్‌జైన్ ఆదివారం రాత్రి రూ.1,11,00,1 విరాళంగా చెక్కు రూపంలో అందించారు. దాతను ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

ప్రమాదకరంగా బండకుంట చెరువు కట్ట




గున్నేకుంట చెరువు, బండకుంట చెరువు కట్టలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఇరిగేషన్ జేఈ, తహసీల్దారు తదితరులు

పెద్దపంజాణి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దపంజాణి మండలంలో రెండు చెరువుల కట్టలు ప్రమాదకరంగా మారాయి. కొళత్తూరు పంచాయతీ గుత్తివారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న గున్నేకుంట చెరువుకు అధికంగా వర్షపు నీరు రావడంతో చెరువు కట్ట సగానికి బీటలు వారి ఓ పక్కకు ఒరిగిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో బాలాజీ, ఇరిగేషన్ జేఈ లక్ష్మీనారాయణలు ప్రమాదకరంగా మారిన చెరువుకట్టను సందర్శించారు. అలాగే గోనుమాకులపల్లె పంచాయతీ బండకుంట చెరువు కట్ట మధ్యలో బీటలువారి ఓ పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. తహసీల్దారు హనుమంతు, ఎంపీడీవో బాలాజీ, జేఈ లక్ష్మీనారాయణ సందర్శించారు. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మొరవపోతున్న సుబ్బరాయకుంట చెరువు



చెరువు నిండి దండపల్లె రోడ్డుపై వెళ్తున్న సుబ్బరాయకుంట మొరవనీరు

గంగవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సుబ్బరాయకుంట చెరువు నిండి ఆదివారం మొరవపోతోంది. గంగవరం సాయి నగర్ సమీపంలో ఉన్న సుబ్బరాయకుంట చెరువుకు ఉన్న తూము వద్ద అక్రమార్కులు మట్టిని తవ్వేయడంతో తూము మూసుకుపోయింది. దీనికితోడు తూము వద్ద చెట్లు పెరిగిపోవడం, శుభ్రం చేయకపోవడంతో చెరువు నిండితే మొరవనీరు తూములో కాకుండా దండపల్లె రోడ్డుపైనే ప్రవహిస్తోంది. రోడ్డుపైనే మొరవనీరు ప్రవహిస్తుండటంతో గుంతలు ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి చెరువు మొరవ నీరు వెళ్లడానికి తూముకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

కౌండిన్య వంతెనకు గుండి



కౌండిన్య నదిపై వంతెన పక్కన పడిన గండి

పలమనేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలో కౌండిన్య నది గత 10 రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. పలమనేరు నుంచి పెద్దపంజాణి మండలం శంకర్రాయలపేట గ్రామానికి ఉన్న రహదారి ఈ కౌండిన్య నదిపై నిర్మించిన వంతెనపైనే వెళ్తోంది. అయితే శనివారం కురిసిన భారీ వర్షానికి కౌండిన్యకు ఎగువ ప్రాంతాలనుంచి నీరు అధిక మొత్తంలో రావడంతో ఈ వంతెనకు ఒకవైపు రోడ్డుకు గండిపడి దాదాపు నాలుగు అడుగుల మేర మట్టి కొట్టుకుపోయింది. దీంతో ఆ రహదారిపై వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గండిని పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.

5 లోపు గృహనిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రొంపిచెర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆవాస్ ప్లస్ సర్వేలో ఇంటి స్థలం, పట్టా ఉన్నవారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో పుంగనూరు నియోజకవర్గంలో అర్హులు నవంబరు 5వ తేదీలోపు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఆయా మండలాల్లో అర్హులైన వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

బాబోయ్ కుక్కలు...!

● కల్లూరు హైవేపై ద్విచక్ర వాహనదారులకు తప్పని తిప్పలు




కల్లూరు హైవేపై హల్‌చల్ చేస్తున్న వీధి కుక్కలు

కల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు మేజర్ పంచాయతీ పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ముఖ్యంగా పట్టణంలోని హైవే రోడ్డుపైకి చేరుకుంటున్న కుక్కల గుంపు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. కుక్కల గుంపులను చూస్తున్న ప్రజలు భయంతో పరుగులు పెడుతున్నారు. కల్లూరులో కొద్ది రోజుల క్రితం కుక్కల దాడిలో పలువురు చిన్నారులకు తీవ్ర గాయాలు కావడంతో స్పందించిన అప్పటి పంచాయతీ కార్యదర్శి నాగరాజు సిబ్బందితో వీధి కుక్కలను పట్టించి సుదూర ప్రాంతంలో వదిలిపెట్టారు. అయితే కల్లూరులో మళ్లీ కుక్కల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ద్విచక్రవాహనం స్వాధీనం



మోటారు సైకిల్‌ను సీజ్ చేసిన ఎస్ఐలు హరిప్రసాద్, కేవీ.రమణ

పుంగనూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో మోటారు సైకిల్‌కు అధిక శబ్దం వచ్చేలా సైలెన్సర్ అమర్చిన ద్విచక్రవాహనాన్ని ఆదివారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ వాహన తనిఖీలు చేస్తుండగా ఓ యువకుడు పెద్దశబ్దం చేస్తూ వాహనం నడుపుతుండగా అదుపులోకి తీసుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం



పేదలకు మందులు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ హరిజనవాడలో ఆదివారం శ్రీప్రియ నర్సింగ్ హోం (డాక్టర్ సుధీర్ హాస్పిటల్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతైంది. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం ప్రారంభించిన ఈ శిబిరంలో సుమారు 250 మంది పేద ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, మండల టీడీపీ అధ్యక్షుడు రాజగోపాల్, మాజీ ఎంపీపీలు సాంబశివం, డాక్టర్ వెంకటేశ్, ఏంఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, నాయకులు జేకే.సంతోశ్, బాలు, మునిరత్నం, బీరప్ప, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కనువిందుగా మొరవ పరవళ్లు



చెన్నపట్నం చెరువు వద్ద మొరవ పరవళ్లు

సోమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పలుచెరువులు భారీ వర్షాలకు మొరవలు పోతూ పరవళ్లు తొక్కుతున్నాయి. జలాలు ఉధృతితో కిందకు జాలువారుతూ జలపాతాలను హోరెత్తుతున్నాయి. వీక్షకులను కనువిందు చేస్తున్నాయి. ఇరికిపెంట చెన్నపట్నం చెరువు, గార్గేయనది సొగసులు చూసేందుకుప్రజలు తరలి వస్తున్నారు.

ఎన్జీవో సంఘ సభ్యత్వ నమోదు ప్రారంభం

పలమనేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు తాలూక ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ఎన్జీవో సంఘ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఆనంద బాబు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సంఘంలో చేరి సంఘానికి బలం చేకూర్చాలన్నారు. మూడేళ్లకు గాను రూ.300 చొప్పున సభ్యత్వ రుసుం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి, జిల్లా అధ్యక్షులు రమణ, నాయకులు దాము, గణేష్, జ్ఞానేశ్వర్, సురేష్, మోహన్, రాంప్రసాద్ పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లెలో లోపించిన పారిశుధ్యం




బ్రాహ్మణపల్లె గ్రామంలో బురదమయంగా ఉన్న వీధులు

పెద్దపంజాణి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలంలోని బ్రాహ్మణపల్లెలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగునీరు వీధులపై ప్రహిస్తున్నాయి. దీంతో దోమలు అధికమవుతున్నాయి. పాఠశాల ఆవరణలో సైతం మురుగునీరు పేరుకుపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చౌడేపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పార్వతి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు తుఫాన్ కారణంగా గాలివాన ప్రభావం తీవ్రంగా ఉంటుందని, గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే మండలంలో అన్ని చెరువులు, కుంటలు నిండి మొరవలు పోతున్నాయన్నారు. అవసరం ఉంటే తప్ప చెరువుల వైపు ప్రజలు వెళ్లరాదని, చిన్న పిల్లలు చెరువుల వద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమైతే సచివాలయ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలని ఆదేశించారు. అత్యావసర సమయంలో ఫోన్‌నంబర్లు 9491077071 (తహసీల్దార్ పార్వతి), 6301181477 (డీటీ రామ్మూర్తి) లకు సహాయం కోసం ప్రజలు సంప్రదించాలని కోరారు.

వృత్తి విద్యా కోర్సులతో తక్షణ ఉపాధి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

రామకుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులను అభ్యసించడంతో తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని విజలాపురం ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. నైపుణ్యాభివృద్ధి నిమిత్తం కోర్సులో చేరిన విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. విజలాపురం ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులను శాంతిపురం మండల పరిధిలోని పలు పరిశ్రమలకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు శివకుమార్, హరీష్, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

రబ్బానీకి జాతీయ అవార్డు ప్రదానం



ఢిల్లీలో జాతీయ అవార్డు తీసుకుంటున్న రబ్బానీ

పుంగనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ గాలిబ్ అకాడమిలో నిర్వహించిన జాతీయ ఉర్దూ టీచర్స్ అవార్డు కార్యక్రమంలో పుంగనూరు ఇస్లాంనగర్ జడ్పీ ఉర్దూ హైస్కూల్‌లో గణిత టీచర్ వి.రబ్బానికి ఆదివారం నిర్వాహకులు అవార్డును ప్రదానం చేశారు. దీంతో పుంగనూరులోని ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం చంద్రబాబు పేదల పెన్నిధి

సోమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు పేదల పెన్నిధి అని సోమల టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం సోమలలో పలువురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. సూరయ్యగారిపల్లెకు చెందిన మునిచంద్ర కు రూ. 86 వేలు, ఆవులపల్లె రాజగోపాల్‌నాయుడుకు రూ.96, 583, నంజంపేట లక్ష్మీదేవికి రూ. 67,032 లకు సంబంధించిన చెక్కులను అందజేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, ఉమాపతినాయుడు, రెడ్డెప్పనాయుడు, అష్రఫ్ అలీ, బాలకృష్ణమనాయుడు, శ్రీనివాసులు, హరిప్రసాద్, వేణుగోపాల్ నాయుడు, మహేంద్రబాబు, జనార్దన్, భానుప్రకాశ్ నాయుడు సుధాకర్, రెడ్డెప్పనాయుడు, సతీశ్ నాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొర్లకుంటవారిపల్లె @ కోనసీమ



పచ్చదనం పరుచుకున్న కొర్లకుంటవారిపల్లె పరిసరాలు



పల్లెకు ఆనుకొని పచ్చని చెట్ల మధ్యలో ప్రవహిస్తున్న గార్గేయ నది

సదుం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సదుం మండలం తిమ్మానాయునిపల్లె పంచాయతీ కొర్లకుంట వారిపల్లె కోనసీమ అందాలను తలపిస్తోంది. పల్లెకు ఎగువన నిండు కుండలా నీటితో తొణికిసలాడుతున్న సాగునీటి ప్రాజెక్టు, పల్లెకు ఆనుకొని పరవళ్లు తొక్కుతున్న గార్గేయ నది ప్రవాహం, పల్లె పరిసర ప్రాంతమంతా ఎటుచూసినా పాడి పంటలతో పచ్చదనం పరుచుకుంది. ఎత్తైన కొబ్బరి చెట్లు మరింత శోభను కల్పిస్తున్నాయి. ఎటుచూసినా నీరు, పచ్చదనం, పాడి పంటలతో కొర్లకుంటవారిపల్లె కొత్త అందాలను సంతరించుకుంది.

టీడీపీ సీనియర్ నేత మృతి



వెంకటేశప్పకు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత వెంకటేశప్పయ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, టీడీపీ మాజీ మండలాధ్యక్షులు ఆనందరెడ్డిలు స్థానిక నేతలతో కలిసి ఆయన మృతదేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెరుమాల్, సుబ్రహ్మణ్యం, మురళీమోహన్, శ్రీనాథరెడ్డి, ఆనందరెడ్డి, పద్మనాభరెడ్డి, సతీష్ లక్ష్మీనారాయణరెడ్డి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి ఒకరి మృతి

బైరెడ్డిపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మపురి గ్రామంలో ఆదివారం ఇంటి గోడ కూలి గంగాధర్ (31) అనే వ్యక్తి మృతి చెందారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఇంటి గోడ ప్రమాదవశాత్తు కూలిపోవడంతో గంగాధర్ తీవ్రంగా గాయపడి మృతిచెందారు.

అర్చకుడు కల్యాణ్‌స్వామికి నివాళులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెకు చెందిన అర్చకులు దివంగత కల్యాణ్‌స్వామి జ్ఞాపకార్థం ఆదివారం ఆయన మిత్రులు బైరెడ్డిపల్లెలో అన్నదానం చేశారు. ఆదివారం కల్యాణ్‌స్వామి జయంతి కావడంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న నేతలు

రామకుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గోవిందరాజపురానికి చెందిన వెంకటేష్ 4 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేసుకుని కోలుకున్నాడు. కుటుంబ సభ్యులు అతని వైద్యం కోసం సుమారు రూ. 6 లక్షలకు పైగా అప్పులు చేసి ఖర్చు పెట్టారు. అతడి కుటుంబానికి ప్రభుత్వం రూ.2.08 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేసింది. ఆదివారం టీడీపీ మండల అధ్యక్షులు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్ గ్రామానికి చేరుకుని చెక్కును అందించారు. క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, కో ఇన్‌చార్జి నవీన్, మైనారిటీ నేతలు ఆదిల్, సలాం, శ్రీనాథరెడ్డి, సతీష్, లక్ష్మీనారాయణరెడ్డి, ఆనంద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మరళీమోహన్, రమాకాంత్ ఉన్నారు.

వైసీపీ పంచాయతీ కార్యవర్గం ఎంపిక

రామకుప్పం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆదివారం మండల పరిధిలోని పలు పంచాయతీలో వైసీపీ కొత్త కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. బైపరెడ్లపల్లె పంచాయతీ కమిటీ అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జయరామిరెడ్డి, యూత్ అధ్యక్షుడిగా అమరేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా సుధాకర్‌రెడ్డి, సింగసముద్రం అధ్యక్షుడిగా శివాజీ, ప్రధాన కార్యదర్శిగా శంకర్, యూత్ అధ్యక్షుడిగా సెల్వరాజ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా సుబ్రహ్మణ్యం, 89 పెద్దూరు అధ్యక్షుడిగా ఎం.మణి, కార్యదర్శిగా మురుగేష్, యూత్ అధ్యక్షులుగా చంద్రబాబు, సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రకాష్‌లను ఏకగ్రీవం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, నేతలు మురుగేష్, బర్కతుల్లా, యశ్వంత్‌రెడ్డి, గోవిందప్ప, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

పుంగనూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మేలుపట్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నివాసమున్న ఎస్.మస్తాన్‌బాషా ఇంటి ఎదుట ద్విచక్రవాహనం ఉండగా శనివారం రాత్రి చోరీకి గురైంది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేవీ.రమణ తెలిపారు.

కార్తీక వనభోజనాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు హరిహర బ్రాహ్మణ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గూడూరుపల్లె శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కార్తీక వనభోజనాలు నిర్వహించారు. బ్రాహ్మణులు శాస్త్రోక్తంగా కార్తీకమాసం సందర్భంగా ఉసిరిచెట్టుకు పూజలు, శివపారాయణం చేశారు.

సీపీఎస్ రద్దుకు తక్షణ చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంటా మోహన్

పుంగనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో తక్షణ చర్యలు తీసుకుని పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో పుంగనూరు డివిజన్ ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం మేరకు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు మీడియం కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలుగు మీడియం కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇన్‌సర్వీసు టీచర్లకు టెట్ పరీక్షల నిర్వహణ విషయంలో గందరగోళానికి తెరదించాలని సూచించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడియాల మురళీ మాట్లాడుతూ టీచర్లకు బోధనేతర పనులు పూర్తిగా తగ్గించాలని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మోహన్‌యాదవ్ మాట్లాడుతూ 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని, మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నాయకులు పోకల మధుసూదన్, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మంజునాథ్, సుధాకర్, బుడ్డన్న, లింగమూర్తి, గురుప్రసాద్, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, తులసీదాస్ పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి



వి.కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దూసుకొస్తున్న తరుణంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఉదయ్‌సంతోష్, సీఐ సోమశేఖర్ సూచించారు. మండల పరిధిలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 140 చెరువులుండగా ఇప్పటికే హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 16, వర్షాలకు 4 చెరువులు నిండాయని మిగిలిన చెరువలకు నీటి ప్రవాహం కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పిల్లలు చెరువులు, బావుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బైరెడ్డిపల్లె ఎంఈవోగా జనార్దన్‌రెడ్డి



బైరెడ్డిపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ఎంఈవో-1 గా జనార్దన్‌రెడ్డి ఆదివారం ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కమ్మపల్లె జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తుండిన ఆయన పదోన్నతిపై బైరెడ్డిపల్లె ఎంఈవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది ఎంఈవోను ఘనంగా సత్కరించారు.

ఫ్రీజర్ బాక్సుల రవాణా వాహనానికి రూ.లక్ష విరాళం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్

పుంగనూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మార్చురీ ఫ్రీజర్ బాక్సుల ఉచిత రవాణా వాహనం కోసం స్థానిక యోగా గురువు వనిత సంస్థకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవన్‌లో జరిగిన మానవత సంస్థ సమావేశంలో సంస్థ అధ్యక్షుడు ఏసీ.నారాయణరెడ్డి, డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ గత నెలరోజులుగా సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. వనితను అభినందించారు. అలాగే దాతలు వాహనం కొనుగోలు, ఇతర సేవా కార్యక్రమాలకు విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మానవత ప్రతినిధులు పాల్గొన్నారు.

చల్లాపై అసత్య ఆడియో ప్రచారం సిగ్గుచేటు

పుంగనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యానికి పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి మరక అంటేలా వైసీపీ కోవర్టులు ఓ మహిళతో సత్యదూరమైన ఆరోపణలను ప్రచారం చేయడం సిగ్గుచేటని పుంగనూరు టీడీపీ నేతలు ఖండించారు. ఆదివారం పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్.శమిపతి, టీడీపీ ఫైవ్‌మెన్ కమిటీ సభ్యులు ఎం.శ్రీకాంత్, సీవీ.రెడ్డి, ఎస్.సుహేల్‌బాషా, మండల టీడీపీ అధ్యక్షుడు జి.మాదవరెడ్డి తదితరులు మాట్లాడారు. పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 500 మందిపై చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన గొడవలపై హత్యాయత్నం కేసులు పెట్టించి చల్లా బాబుతో సహా చాలామందిని జైలుకు పంపారన్నారు. టీడీపీ అంటేనే వారిపై అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలు చేయడం, భూమి రికార్డుల మార్పులు తదితర అనేక ఇబ్బందులు పెట్టి టీడీపీని కనుమరుగు చేయాలనే ప్రయత్నాలను చల్లా బాబు అడ్డుకున్నారన్నారు. వైసీపీ మైండ్‌గేమ్‌తో ఫేక్ ఆడియోతో చల్లా రామచంద్రారెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. 1983 నుంచి చల్లా కుటుంబం టీడీపీలోనే ఉంటూ పార్టీ శ్రేణులకు అండగా ఉన్నారని, వారిపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. నకిలీ ఆడియా వైరల్‌పై నిగ్గుతేల్చాలని పోలీసులను కోరినట్లు చెప్పారు.



సోమలలో మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యలు సుబ్రహ్మణ్యం

● **సోమల**: పుంగనూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సింగిల్ విండో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ కొంత మంది వ్యక్తిగత కక్షలతో చేస్తున్నప ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు పీవీ శివశంకర్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, మహేంద్రబాబు, మల్లికార్జున, జనార్దన్, మణి యాదవ్, చాణుక్య, రెడ్డెప్ప నాయుడు, భానుప్రకాశ్‌నాయుడు, వేణుగోపాల్ నాయుడు, వెంకటరత్నం, అష్రఫ్ అలీ, సతీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూలిపోయిన గుడిసె




గుడిసె వద్ద తల్లి తులసమ్మతో శివకుమారి, పడిపోయిన గోడలు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కనగారిపల్లె ఆదిఆంధ్రవాడకు చెందిన శివకుమారి నివసిస్తున్న పూరి గుడిసె గోడలు శనివారం రాత్రి పడిపోయాయి. అక్కనగారిపల్లె ఆదిఆంధ్రవాడలో శివకుమారి, ఆమె కుమార్తె భువనేశ్వరి, తల్లి తులసమ్మతో నివాసం ఉంటుండగా, కురుస్తున్న వర్షాలకు పూరి గుడిసె గోడలు బాగా నానిపోయి శనివారం రాత్రి పడిపోయాయి. పూరిగుడిసె సైతం అంతంత మాత్రంగానే ఉంది. తమ కుటుంబాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదుకోవాలని శివకుమారి వేడుకుంటున్నారు. ఈసమాచారం తెలుసుకుని జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, సభ్యులు హరిక్రిష్ణారెడ్డి, యాగమరెడ్డి, గోపి, చిరంజీవిలు కలిసి ఆదివారం శివకుమారి కుటుంబానికి టార్పాలిన్ పట్టా, వంటసామగ్రి అందజేశారు.

అర్ధరాత్రి నీవానది పరివాహక ప్రాంతాల పరిశీలన



వీరభద్రకాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి కమిషనర్ నరసింహప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, ఇతర సిబ్బందితో కలిసి నీవానది పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. తేనెబండ, వీరభద్రకాలనీ, ధర్మరాజులగుడి వీధి, ఏటివార ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. నగరపాలక ప్రాంతాల్లో మూడు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచామని కమిషనర్ తెలిపారు. మరో మూడు రోజుల పాటు తుఫాన్ ఉందనే అంచనాతో నగరపాలక అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కల్వర్టులు, వంతెనలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు వారి వారి పరిధిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

29న జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

చిత్తూరు సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 29న గుడిపాల మండలంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించినట్లు ఆ పార్టీ సీనియర్ నేత పగడాల శశికాంత్ చెప్పారు. రెండు రోజుల చిత్తూరు ఉమ్మడి జిల్లాల పర్యటన ముగించుకుని తిరుగుపయనమైన మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో గుడిపాల మండలంలో నిర్వహించతలపెట్టిన జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ ఆహ్వాన పత్రికను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, సుభాషిణి, తాతంశెట్టి నాగేంద్ర, కిరణ్ రాయల్, ఫైఫోర్స్ మహేష్, రాజారెడ్డి, దేవర మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన నాగాలమ్మ జాతర

గుడిపాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 197రామాపురంలో నాగాలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి మేఘనాథం, బాలాజీ ఆధ్వర్యంలో పుష్పపల్లకిని ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ బాణసంచా పేలుస్తూ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

ప్రమాదాన్ని హెచ్చరిస్తూ సూచిక బోర్డు ఏర్పాటు



సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న టీడీపీ కార్యకర్త బబ్లూ ప్రసాద్

పూతలపట్టు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):పూతలపట్టు మండలం ఎం.బండపల్లె మీదుగా పెనుమూరు మండలానికి వెళ్లే రోడ్డు వద్ద వున్న నీవా నది వంతెన గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొట్టుకుపోయింది. దీంతో వర్షపు నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీనిపై అధికారులు పట్టించుకోకపోవడంతో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి అనుచరుడు, బండపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బబ్లూ ప్రసాద్ వంతెన సమీపానికి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేసేవిధంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

నేటి 'పీజీఆర్‌ఎస్' రద్దు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్‌ఎస్ కార్యాక్రమాన్ని రద్దుచేసినట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. వర్ష ప్రభావం కారణంగా పీజీఆర్‌ఎస్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. నగర ప్రజలు ఈ మార్పును గమనించి నగరపాలక కార్యాలయానికి రావద్దని కోరారు.

మొంథా తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మీడియాతో మాట్లాడుతున్న సీఐ హనుమంతప్ప

వెదురుకుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆదివారం ఆయన జీఎంఆర్‌పురం వద్ద మీడియాతో మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వెదురుకుప్పం, ఎస్‌ఆర్‌పురం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాల ప్రజలు, చిన్న పిల్లలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ వల్ల వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయని, చిన్నపిల్లలను ఈత కొట్టడానికి పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదకర వాగులు, వంకల వద్ద నిరంతర పోలీసు నిఘా ఉందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఎస్‌ఐ సుమన్, కానిస్టేబుళ్లు వజ్రవేలు, హరిప్రసాద్ ఉన్నారు.

క్వారీ తనదేనంటూ లారీని అడ్డుకున్న వ్యక్తి

బంగారుపాళ్యం, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబువారిపల్లె రెవెన్యూ సమీపంలో గత కొన్ని రోజులుగా క్వారీ నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఆదివారం రాత్రి సాయిరెడ్డి అనే వ్యక్తి ఈ క్వారీపై తనకు అనుమతులు ఉన్నాయంటూ క్వారీకి చెందిన లారీని అడ్డుకున్నాడు. దీంతో నిర్వాహకులకు సాయిరెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులకు విషయం తెలియడంతో ఎస్సై ప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువురితో చర్చించారు. క్వారీ లీజు అనుమతి పత్రాలను చూపాలని సాయిరెడ్డికి సూచించారు. పోలీసులు ఈ విషయంపై విచారిస్తున్నారు.

సబ్‌వే లోకి చేరిన వర్షపు నీరు

● రాకపోకలు బంద్



సబ్‌వేలో నిలిచిన వర్షపు నీరు

చిత్తూరు సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని దొడ్డిపల్లె రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న సబ్‌వే వర్షపు నీటితో నిండిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సబ్‌వేలో సుమారు ఎనిమిది అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గత ఏడాది కూడా ఈ సబ్‌వేలోకి నీరుచేరడంతో ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు ఇరుక్కుపోయింది. సమయానికి స్థానికులు ట్రాక్టర్ సహాయంతో బస్సును వెలుపలకు లాగారు. ఇప్పుడు సబ్‌వేలో నీరు నిలిచిపోవడంతో ఈ మార్గాన్ని మూసివేశారు. బయటి ప్రాంతం నుంచి వర్షపు నీరు ఇందులో కలుస్తుండడంతో చేపలు చేరాయి. స్థానికులు, పిల్లలు ఇందులో చేపలు పడుతున్నారు.

ఎట్టకేలకు రైల్వే బ్రిడ్జి కింద నీటి తొలగింపునకు చర్యలు

గుడిపాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలిచి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు ఆదివారం ఆయన పీఏలు కుమారస్వామి యాదవ్, మోహన్ మండలంలోని గురుగునత్తం రైల్వే బ్రిడ్జి వద్ద ఉన్న నీటిని తొలగించడానికి చర్యలు చేపట్టారు. వర్షం వచ్చినప్పుడల్లా ఈ సమస్య ఏర్పడటంతో సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడి ఇకపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యంయాదవ్, నేతలు దొరబాబు యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో భయం భయం



49.కొత్తపల్లెమిట్టలో గుంపులు గుంపులుగా వీధి కుక్కలు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్టలో కుక్కకాటుకు గురయ్యేవారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. వీధుల్లో గుంపులుగా చేరి దాడి చేస్తుండటంతో జనం భయాందోళన చెందుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వీధుల్లో గుంపులుగా చేరి ద్విచక్రవాహనాల వెంట పడుతుండటంతో వాహనదారులు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న నీవానది ప్రవాహం




ఎ.వెంకటాపురానికి సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న చెరువు మొరవనీరు - కొండేపల్లె దళితవాడ వద్ద తెగిపోయిన పాత కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీడీవో

గంగాధరనెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆత్మకూరు - నరసింగరాయనిపేట, కలిజవేడు - కొట్రకోనల మధ్య నీవానది ప్రవాహం ఉధృతంగా సాగుతుంది. సుమారు రెండునెలలుగా గంగాధరనెల్లూరు మండలంలో నీవానది ప్రవాహం కొనసాగుతూనే ఉంది. అదేవిధంగా చిత్తూరు రూరల్, చిత్తూరు నగరం, పెనుమూరు, యాదమరి మండలాల్లో కురిసే వర్షం గంగాధరనెల్లూరు వద్ద నీవానదిలోకి వచ్చి కలుస్తున్నాయి. దీనికితోడు కలవకుంట వద్ద గల ఎన్టీఆర్ జలాశయం నిండిపోయినపుడల్లా ఆ నీటిని దిగువప్రాంతమైన గంగాధరనెల్లూరు నీవానదిలోకి గేట్లు ఎత్తి వదిలేస్తుంటారు. మండలంలో పలుచోట్ల చెరువులు నిండిపోయి వాటి మొరవలు ఎ.వెంకటాపురం, బంగారెడ్డిపల్లె, ఎల్లాపల్లె వద్ద బస్సులు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్లపై జోరుగా ప్రవహిస్తున్నాయి. దీంతో చెరువులు మొరవలు సాగే రోడ్లుగల ఆ ప్రాంతాల్లో కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు దాటుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. బంగారెడ్డిపల్లె పంచాయతీ శెట్టిఫారం వద్ద మొరవనీరు ఉధృతంగా సాగడంవల్ల ఆ గ్రామానికి వెళ్లే కల్వర్టుకు పక్కన రోడ్ కోతకు గురై ప్రమాదకరంగా మారి తెగిపోయే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కొండేపల్లె దళితవాడనుండి వీరకనెల్లూరు వెళ్లే దారిలో పాతకల్వర్ట్ రోడ్ చెరువునీటి ప్రవాహానికి తెగిపోవడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కాగా ఆదివారం చెరువులు మొరవసాగే ప్రాంతాల్లో వేర్వేరుగా ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాసలు పర్యవేక్షించి, కిందిస్థాయి అధికారులను అప్రమత్తంచేశారు.

వర్షం కురిస్తే చవటపల్లెకు దారెటు..?

● ఇళ్లకు వెళ్లాలన్నా గ్రామస్తులకు తప్పని తిప్పలు



చవటపల్లె వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్



రైల్వే అండర్ బ్రిడ్జి కింద మురుగునీటిని తొలగిస్తున్న వాహనం

పూతలపట్టు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వర్షాలు ఎక్కువ కురిస్తే పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ చవటపల్లి వద్ద వున్న రైల్వే అండర్ బ్రిడ్జిలో మురుగునీరు నిల్వచేరుతోంది. దీంతో గ్రామస్తులు తమతమ ఇళ్లకు వెళ్లేందుకు తిప్పలు పడుతున్నారు. వర్షం పడితే గ్రామస్థులు ఇళ్లలో నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. తమ గ్రామానికి ప్రస్తుతం ఉన్న దారితో పాటు మరొకదారిని ఏర్పాటు చేసి, ఈ సమస్యను పరిష్కరించాంటూ మండలస్థాయి అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై రెండ్రోజుల క్రితం గ్రామస్థులు అండర్ బ్రిడ్జి సమీపాన జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన కూడా వ్యక్తం చేశారు. అయినా ఆ దారి సమస్య పరిష్కారం కాలేదు. ఇకనైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి నూతనంగా మరో రోడ్డును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చవటపల్లి గ్రామస్తులను ఆదుకుంటా

● ఎమ్మెల్యే మురళీ మోహన్

చవటపల్లె గ్రామస్తులను అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. చవటపల్లి వద్ద వున్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు మురుగునీరు చేరడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. దీంతో ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఆదివారం సాయంత్రం బ్రిడ్జి వద్దకు చేరుకుని పరిస్థితులను సమీక్షించి, విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ చవటపల్లి గ్రామస్తుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని హామీ యిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబూరావు, నేతాజి నాయుడు, వేణుగోపాల్ నాయుడు, మురళీ నాయుడు, చింటు, సురేంద్ర నాయుడు, దాము తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఊటువంక కామాక్షమ్మ చెరువు కట్ట



లీకేజీలను పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు



కోసుకుపోయిన ఊటువంక కామాక్షమ్మ చెరువు కట్ట

బంగారుపాళ్యం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారుపాళ్యం పంచాయతీ ఊటువంక గ్రామంలోని ఊటువంక కామాక్షమ్మ చెరువు కట్ట ప్రమాదకర స్థితిలో ఉంది. ఇటీవ ల వరుసగా కురిసిన వర్షాలకు చెరువు నిండి మొరవ సాగింది. నీరు ఎక్కువగా చేరడంతో కట్ట కింది భాగం మట్టి జారిపోవడంతో నీటి లీకేజీవుతోంది. ఈ విషయాన్ని గమనించిన రైతులు ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్, తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, టీడీపీ మండల గౌరవాధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్‌కు తెలియజేశారు. దీంతో వారు ఆదివారం చెరువు కట్టను పరిశీలించి ట్రాక్టర్ల ద్వారా మట్టిని నింపుతున్నారు. ఇసుకమూటలు కట్టి నీరు లీకేజీ కాకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కత్తి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు జనార్ధన్‌గౌడ్, కొండేటి శివ,రమేష్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

నిండు కుండలా చెరువులు



మొరవపారడానికి సిద్ధంగా మంగళం చెరువు

విజయపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువులు నిండు కుండలా మారాయి. పంచాయతీ రాజ్, ఇరిగేషన్ చెరువులు మొత్తం 40 వరకు ఉన్నాయి. రెండు మూడు చెరువులు మినహా మొత్తం చెరువులు నిండి మొరవ పారుతున్నాయి. మండలంలోనే పెద్దదైన పన్నూరు చెరువుకు నాలుగు సంవత్సరాల క్రితం తూము వద్ద లీకేజీకి గురికావడంతో తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. వర్షం ఎక్కువైతే అప్రమత్తంగా ఉండాలని రైతులు చెబుతున్నారు. పన్నూరు ఆదిఆంధ్రవాడ సమీపంలో పెద్ద గుంట ఆనుకొని ఉండడంతో ఇంట్లోకి వర్షపునీరు చేరకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది. మండలంలోని మహారాజపురం ఆదిఆంధ్రవాడలో కూడా ఇంట్లోకి వర్షపునీరు చొరబడకుండా అప్రమత్త చర్యలు అవసరమని గ్రామస్తులు చెబుతున్నారు.

కార్పొరేట్లకు ఊడిగం చేసే మోదీని గద్దె దింపాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

చిత్తూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మితవాద, మతవాదంతో కార్పొరేట్లకు ఊడిగం చేసే మోదీని గద్దె దింపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీయూ కార్యాలయంలో సీపీఐ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ఆర్థిక విధానాల ఫలితంగా దేశంలో నిరుద్యోగ సమస్య, అధిక ధరలతో ప్రజలు పేదరికంలోకి నెట్టబడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నియంత్రత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ఏపీలో మూడు ప్రధాన పార్టీలు మోదీ జపం చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. కార్మిక, ఉద్యోగుల సమస్యలు తీర్చే పరిస్థితి కనపడలేదని, మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ పేదలకు విద్యను దూరం చేస్తున్నారని అన్నారు. రానున్న కాలంలో సీపీఐ బాధ్యత కలిగిన అసలైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ, ప్రజాఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు నాగరాజు, విజయగౌరీ, మణి, వేలన్, షబ్బీర్ బాష పాల్గొన్నారు.

పదేళ్లుగా మీరు చేసిన అభివృద్ధి ఏంటమ్మా...?

● రోజాకు టీడీపీ నాయకుల ప్రశ్న



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నగరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో గత 10 సంవత్సరాలు మీరు ఏమి అభివృద్ధి చేశారో చెప్పగలరా రోజా మేడం అంటూ నగరి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, టీఎన్‌టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి జ్యోతినాయుడు ప్రశ్నించారు. ఆదివారం నగరిలో వారు మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం ఏడాదిన్నర కాలంలోనే కోట్లాది రూపాయలతో గ్రామీణ ప్రాంతాల రోడ్లు, ప్రధాన రహదారులు బాగు చేసిన ఘనత ఎమ్మెల్యే భానుప్రకాష్‌దేనన్నారు. 700 మందికి పై చిలుకు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించిన ఘనత ఆయనదని చెప్పారు. చెన్నైలో ఓ రోజు, విజయవాడలో మరో రోజు ఉండే రోజా భానుప్రకాష్‌ని విమర్శించడం తగదన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసం, దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, పీఎస్‌సీఎస్ అధ్యక్షులు కె.బాలాజీ, శ్రీధర్, శేఖర్, వడివేలు, సదాశివరెడ్డి, ఎం.వి.శ్రీనివాసులు, కన్నయ్య, వెంకటరత్నం, నాయకులు పాల్గొన్నారు.

వాగులు, వంకల ప్రవాహ ఉధృతి పరిశీలన

వెదురుకుప్పం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా వాగులు, వంకలు ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆదివారం కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ సుమన్, కానిస్టేబుళ్లు హరిప్రసాద్, వజ్రవేలుతో కలసి వరదనీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని పలు వాగులు, వంకలతో సహా కృష్ణాపురం జలాశయాన్ని పరిశీలించారు. ప్రమాదకర వాగులు, వంకల వద్ద రెడ్ రిబ్బన్ బారికేడ్లను ఏర్పాటు చేయించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీసులు విధులను నిర్వహించాలన్నారు. ఏదైనా ఇబ్బంది కలిగితే వెంటనే సీఐ-9440900689, ఎస్‌ఐ-9440900692, టోల్ ఫ్రీ-112 లేదా 1070కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

తగ్గని వాగుల ఉధృతి



జీఎంఆర్‌పురం వద్ద వాగు ఉధృతి, వర్షాలకు దెబ్బ తిన్న కల్వర్టు

వెదురుకుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా వాగులు, వంకల ఉధృతి తగ్గడం లేదు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పెనుమూరు, వెదురుకుప్పం, ఎస్‌ఆర్‌పురం, కార్వేటినగరం, పాలసముద్రం, గంగాధరనెల్లూరు మండలాల్లో చెరువులు, కుంటలు నిండిపోయి జలకళ సంతరించుకున్నాయి. చెరువులు, కుంటల కలుజులు ప్రవహిస్తున్నాయి. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. మొంథా తుఫాన్ పట్ల వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మొంథా తుఫాన్ నేపథ్యంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని జనసైనికులు, వీరమహిళలు అప్రమత్తంగా ఉండాలని, తుఫాన్ వల్ల ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న సూచించారు.

మొంథా తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి

పెనుమూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుండి గురువారం వరకు మొంథా తుఫాన్ ప్రబావం ఉన్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రావణ్ కుమార్ కోరారు. తమ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని ప్రజలు అత్యవసరమైతే 8125975476 నంబరును సంప్రదించమని ఆయన తెలిపారు. 24 గంటలు విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరా ఇచ్చే దిశగా పని చేస్తున్నామని, ప్రజలు ఈ వర్షానికి విద్యుత్ పోల్స్, వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లవద్దని ఏఈ తులసీ ప్రసాద్ సూచించారు.

● **విజయపురం: మొంథా తుఫాన్ ముంచుకొస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితిలో కంట్రోల్ రూం ఫోన్ నెంబరు 9491077037ను సంప్రదించాలని కోరారు.**

● తవణంపల్లె: తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్‌పై తహసీల్దార్ సుధాకర్ సమీక్షించారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని, మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

● పూతలపట్టు: తుఫాన్ తీవ్ర ప్రభావం చూపించే అవకాశముందని, అధికారయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేష్ అన్నారు. ప్రజలు చెరువులు, కుంటలు, జలాశయాల వద్దకు వెళ్లరాదన్నారు.

● గుడిపాల: మండలంలో అన్ని చెరువులు నిండి మొరవపోతున్నందున పిల్లలు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా చూసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. తక్షణ సహాయ సహకారాలు అందించాలంటే వీఆర్వోలు, వీఆర్‌ఏలకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

● నగరి: నగరి మండలం, మున్సిపాలిటీ పరిధిలో గల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. ఇందిరమ్మ కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని, సమీప గల ప్రభుత్వ పాఠశాలల్లో నివాసం ఏర్పరచుకోవాలని సూచించారు. కుశస్థలినది వద్ద వరద ఉధృతి అధికమై వంతెన తెగిపోవడంతో పోలీసులు బారికేడ్లు అడ్డంగా పెట్టి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.